క్లుప్తంగా

26న విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపూడి: జి.మామిడాడ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ పెదపూడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం ఈ నెల 26న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని కాకినాడ విద్యుత్‌శాఖ ఈఈ జి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.మామిడాడ, రాజుపాలెం, పైన, వేండ్ర, పెద్దాడ, కుమారప్రియం, కై కవోలు, గండ్రేడు తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం: వార్షిక మరమ్మతుల కారణంగా మిర్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈసీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మిర్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్నందున ఉండేశ్వరపురం, మిర్తిపాడు, ములకల్లంక, బొబ్బిల్లంక, కూనవరం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ మోటార్లకు, ఇండస్ట్రియల్ ఫీడర్ కూడా విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

క్రీడలతోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి

బిక్కవోలు: క్రీడలతోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని కొంకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. శిక్షాసప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పీడీ చిక్క రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను తమ దిన చర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. తద్వారా మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు గెలుపు, ఓటములను సమ దృష్టితో స్వీకరించగలిగే తత్వం అలవడుతుందన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



బొబ్బిల్లంకలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతానగరం: బొబ్బిల్లంకలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంధం ఇందిరాభారతి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్-4లో గ్రామంలోని 5 సెంటర్లు కలిసి కిషోర్ బాలికలకు, తల్లులకు బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. 20 ఏళ్లు నిండిన తరువాతే ఆడపిల్లలకు వివాహం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు వి.రాధారాణి, జె.గంగాభవాని, ఎల్.సరోజ, ఎస్.పద్మ, బి.మణి, ఏఎస్ఎంలు లీల, దేవి, మహిళా పోలీస్ ఎం.శ్రీదేవి, పిల్లల తల్లులు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు బుధవారం తెలిపారు. ఎంఎస్సీ ఫిజిక్స్ సెంకడ్ క్లాస్‌లో ఉత్తీర్ణులై 55 శాతం కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. కళాశాలలో ఈ నెల 27వ తేదీన సాయంత్రం 5 గంటల లోగా మార్కుల లిస్టులు, దరఖాస్తు ఫారాలను అందజేయాలన్నారు. 29న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

గైట్‌లో 'అలనాటి రామచంద్రుడు' సందడి



గైట్ యూనివర్సిటీలో అలనాటి రామచంద్రుడు చిత్ర బృందం

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో అలనాటి రామచంద్రుడు చిత్ర బృందం హల్‌చల్ చేసింది. సినీమా ప్రమోషన్ వర్కులో భాగంగా బుధవారం ఇక్కడకు వచ్చిన యువ నటుడు కృష్ణవంశీ, హీరోయిన్ మోక్ష తదతరులు ఇంజినీరింగ్ విద్యార్థులతో కొద్దిసేపు మమేకమయ్యారు. సినీమా టీజర్ని ప్రదర్శించారు. కొన్నిపాటలకు డాన్సులు చేస్తూ హుషారెత్తించారు. సినీమాలోని ప్రత్యేకతలను తెలియజేస్తూ, సకుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమని, అందరూ థియేటర్లలోనే సినీమాను చూసి, తమను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో దర్శకుడు చిలుకూరు ఆకాష్ రెడ్డి, తదితరులు కూడా పాల్గొన్నారు.



బూరుగుపూడిలో పొలాలను ముంచెత్తిన నీరు



శ్రీరంగపట్నంలో ఉరకలెత్తుతున్న బురద కాలువ



శ్రీరంగపట్నంలోని నివాస గృహాల వద్దకు చేరిన వరద నీరు

ముంపు కష్టాలు

- గోదావరి ఎగపోటుతో అవస్థలు
- నీట మునిగిన పంటలు
- ఇళ్ల చుట్టూ చేరిన వరదనీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మధురపూడి: గోదావరి ఎగపోటు, ఉప్పొంగుతున్న బురద కాలువలు కారణంగా సమీప ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఇళ్ల చుట్టూ వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు కూడా కలుషితమై ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని గోదావరి నదీ తీరప్రాంతమైన సీతానగరం మండలం, కోరుకొండ మండలంలోని బుచ్చెంపేట, జగన్నాథపురం, మునగాల, శ్రీరంగపట్నం తదితర గ్రామాలు ముంపులో చిక్కుకున్నాయి.

ఏటా బురదకాలువతో ఇబ్బందే

కోరుకొండ మండలంలో వర్షాల కారణంగా బురద కాలువ ఉగ్రరూపం దాల్చింది. ఈ కాలువ గంగవరం మండలం నెల్లిపూడి నుంచి మొదలై దేవీపట్నం, గోకవరం, కోరుకొండ మండలాల గుండా వంద కిలోమీటర్లు ప్రయాణించి గోదావరిలో కలుస్తోంది.ఈ బురద కాలువ మండలంలో శ్రీరంగపట్నం వద్ద బీభత్సం సృష్టిస్తోంది. కాలువ ముంపు కారణంగా 5 వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. పెట్టుబడులు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు గ్రామాలకు చుట్టూ నీరు చేరడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా పరిష్కార చర్యలు మాత్రం శూన్యం.

గోదావరి ఎగపోటు సమస్య

ఉగ్రగోదావరి కారణంగా వరద నీరు మెరక గ్రామాలకు చేరుతోంది. బొబ్బిల్లంక వద్ద తొర్రిగెడ్డ కాలువగుండా కోరుకొండ మండలంలోని బుచ్చెంపేట, జగన్నాథపురం, మునగాల గ్రామాలతో పాటు, సీతానగరం మండలం మిర్తిపాడు, ఉండేశ్వరపురం, రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని తొర్రేడు గ్రామాలకు వరదనీరు చేరుతోంది. నివాసగృహాలను సైతం ముంచెత్తుతోంది. కాగా కోరుకొండ మండలంలోని పంటపొలాలు మునిగిపోయాయి. బుచ్చెంపేట, జగన్నాథపురం, బూరుగుపూడి, కాపవరం, మునగాల, కోటి, శ్రీరంగపట్నాల్లోని 2వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట మునిగింది.



గోదావరి ఎగపోటు వరద కారణంగా జగన్నాథపురం-మునగాల మధ్య ముంపు నీరు

వరినాట్లు కుళ్లిపోతున్నాయి



గోదావరి వరద పెరుగుతుండడంతో తొర్రిగెడ్డ కాలువ ద్వారా గోదావరి వరదనీరు బుచ్చెంపేట, జగన్నాథపురం గ్రామాలను ముంచెత్తింది. మునగాల, కాపవరం గ్రామాల్లోని పంట నీట మునిగింది. అయ్యన్నగట్ల కాలువకు ఎగపోట రావడంతో పంట పొలాలు మునిగిపోయాయి. ముంపు బారినపడిన వరినాట్లు కొద్దిరోజులకే కుళ్లిపోతున్నాయి.

–తనకాల ప్రసాదు, రైతు, శ్రీరంగపట్నం

శాశ్వత పరిష్కారం చూపాలి



శ్రీరంగపట్నం ముంపు సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలి. బురదకాలువ కారణంగా శ్రీరంగపట్నం చుట్టూ వరదనీరు చేరింది. పంటలు నష్టపోతున్నాం. పునరావాస కేంద్రాలకు వెళ్లలేకపోతున్నాం. ఇప్పటికే గ్రామ శివారులోని యానాదుల కాలనీవాసులను ఆర్‌బీకే భవనంలో చేర్చారు.

–నక్కా రాంబాబు, సర్పంచ్, జగన్నాథపురం

కాలువలను ఆధునీకరించాలి



ఏటా బురదకాలువ ఉప్పొంగుతుంది. ప్రతి సంవత్సరం ఇబ్బంది పడుతున్నాం. ప్రధాన కాలువకు పడిన 5 గండ్లు ఇసుక బస్తాలతో నింపారు. సూరంపాలెం రిజర్వాయర్‌లోని మిగులు జలాలను విడిచి పెట్టకపోవడం కూడా కారణంగా నిలిచింది. కోటి కాలువ, నారా వెంకన్నచెరువు, రవ్వాడి చెరువులోకి వెళ్లే సబ్ కెనాల్స్‌ను ఆధునీకరించాలి. గ్రామంలోని 5 వేల ఎకరాల విస్తీర్ణంలోని వరిపంటకు నష్టం కలిగింది.

–మద్దాల రమణ, నాయకుడు, శ్రీరంగపట్నం

ఘనంగా అయ్యంకి జయంతి



కొంకుదురులో అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళులర్పిస్తున్న పుస్తక ప్రియులు



రంగంపేటలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు తదితరులు

బిక్కవోలు: జాతీయ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలను బుధవారం కొంకుదురు శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ శాఖాధికారి బాల ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల మాట్లాడుతూ అయ్యంకి గ్రంథాలయాల అభివృద్ధి కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలోని విద్యార్థులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

అయ్యంకి ఘన నివాళులు

రంగంపేట: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలు బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ అయ్యంకి ప్రజా గ్రంథాలయమే ప్రజల విశ్వ విద్యాలయమని చాటిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఉద్యమాల ఫలితంగానే రాష్ట్రంలో వేలాది గ్రంథాలయాలు వెలిశాయని గుర్తు చేశారు. అయ్యంకి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వి.మాణిక్యం, విద్యార్థులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

ఆవ భూములను పరిశీలించిన కలెక్టర్



బూరుగుపూడిలో ఆవ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి-కాపవరం గ్రామాల మధ్య ఉన్న ఆవ భూములను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆవ భూముల్లో 361 ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం తీసుకుందని, ఆ మేరకు అర్జీ పెట్టుకున్న లబ్ధిదారులకు పట్టాలను కూడా పంపిణీ చేసిందన్నారు. అయితే ఆవ భూములు ముంపు ప్రాంతమని, ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉందో కాదో పరిశీలించేందుకు వచ్చినట్టు తెలిపారు. అక్కడ రూట్ మ్యాప్ ఆధారంగా వాస్తవ పరిస్థితులను పరిశీలించినట్టు తెలిపారు. సమగ్రమైన సమాచారాన్ని సేకరించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ముంపుకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో సమీక్షించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్ర వర్షిణీ, ఇరిగేషన్ డీఈ కె.ఆనంద బాబు, కోరుకొండ తహసీల్దార్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

పెదపూడి: సర్ ఆర్థర్ కాటన్ గోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన అపరభగీరథుడని అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో బుధవారం కాటన్ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాటన్ దొర గోదావరి జిల్లాలు ధాన్యాగారంగా మార్చిన మహనీయుడని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గొలుగూరి గౌతమి, పీహెచ్‌సీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యుడు కర్రి రామచంద్రారెడ్డి, సబ్బెళ్ల అమ్మిరెడ్డి, కర్రి గోపాలరెడ్డి, కర్రి గాంధీరెడ్డి, కొవ్వూరి ఆదిరెడ్డి పాల్గొన్నారు.



రామవరంలో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

బిక్కవోలు: ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి గోదావరి పరివాహక ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని ఆరికరేవుల గొల్లామ్మ వెలమ సంక్షేమ సంఘ సభ్యులు అన్నారు. బుధవారం కాటన్ 125వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ గురు నాగు, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ సభ్యులు వాసిరెడ్డి వాసు, మాజీ ఎంపీటీసీ బొడ్డు సూర్యనారాయణ పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానాలతో అధిక దిగుబడులు

బిక్కవోలు: వరి సాగులో శాస్త్రీయ విధానాలతో అధిక దిగుబడులు సాధించొచ్చని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు అన్నారు. బుధవారం ఆయన బలభద్రపురం గ్రామంలో రైతులకు ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకల నివారణకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, ప్రధానంగా ఎర-తెర పద్ధతిలో ఇనుప బోనులను ఉపయోగిస్తే ఎలుకల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. గ్రామానికి చెందిన రైతు నల్లమిల్లి సుబ్బారెడ్డి పొలంలో ఎర-తెర పద్ధతిలో బోను ఏర్పాటుచేసి చూపించారు. ఏడీఏ కృష్ణ మాట్లాడుతూ సేంద్రియ విధానంలో వ్యవసాయం చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చన్నారు.



బలభద్రపురంలో రైతులకు ఎర-తెర విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు

కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, బిక్కవోలు ఏవో శామ్యూల్‌జాన్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, వీఏఏలు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ, చదువుల కోసమే..



ఫరిజల్లిపేట పాఠశాలలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గామణి

రాజానగరం: బాలికల సంరక్షణతో పాటు వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో, బేటీ పడావో' కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిని పూర్తి స్థాయిలో విజయవంతం చేసి, భావితరాలకు బంగారు భవితను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దుర్గామణి అన్నారు. మండలంలోని ఫరిజల్లిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, బాలికలకు అవగాహన కలిగించారు. ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పెదపూడి: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, ఇంటింటా మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవీవీ ప్రసాదరావు అన్నారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెదపూడి గ్రామ పంచాయతీ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛతా వారోత్సవాలను సంబంధిత ఉన్నతాధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు వల్లూరి మరియమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, జి.కృష్ణ, సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో మొక్క నాటిన ప్రత్యేకాధికారి ప్రసాదరావు తదితరులు

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

రంగంపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ ముగించుకున్న 70 మంది మహిళలకు ఫౌండేషన్ కార్యాలయం వద్ద బుధవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ, మదర్ థెరిసాలా మహిళలంతా తమకంటూ ఒక చరిత్ర సృష్టించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మగ్గం వర్క్‌లో శిక్షణనిచ్చిన వీరలక్ష్మి, మంగ, అనంతలక్ష్మిలను అభినందించారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, వినీల, యెనుముల సురేష్, యెనుముల తేజ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి సాధ్యం

పెదపూడి: విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి సాధ్యమని ఎంపీపీ కేతా తులసి అన్నారు. పెదపూడి గ్రామంలోని గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టూడెంట్ కిట్లలో నోట్ బుక్స్, డిక్షనరీ, బ్యాగ్, బెల్టులు, బూట్లు, సాక్స్ ఉంటాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు వల్లూరి మరియమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సీహెచ్‌సీడీసీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, హెచ్ఎం కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసిన ఎంపీపీ తులసి తదితరులు

పారిశుధ్య పనులతో దోమల నివారణ

రంగంపేట: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చని ఎంపీడీఓ పి.వెంకటరత్నం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి కుళాయిలు, బోర్ల వద్ద చెత్తా చెదారం తొలగించి, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. తాగునీటి బావులు, మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. చంద్రేడు గ్రామంలో సచివాలయం ఎదురుగా మురుగు పేరుకుపోవడంతో వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సుబ్బారాయుడును ఆదేశించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

రాజానగరం: దివాన్‌చెరువులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన శిక్ష సప్తాహ్ వారం రోజుల కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ఈ పోటీలను సమగ్ర శిక్ష జిల్లా అధికారి, అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర్ పర్యవేక్షించారు. పాఠశాలను సందర్శించిన ఆయన ఆ సమయంలో జరుగుతున్న ఈ పోటీలను పర్యవేక్షిస్తూ, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభా పాటవాలను గుర్తించి, ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 జ్యోతిప్రసాద్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్‌లో భాగంగా మూడో రోజు బుధవారం విద్యార్థులతో సంప్రదాయ క్రీడలు నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.సతీష్‌బాబు ఆధ్వర్యంలో పీడీలు సింహాద్రి, శంకర్‌రావు విద్యార్థులతో అష్టాచెమ్మా, కబడ్డీ వంటి ఆటలను ఆడించారు.



దివాన్‌చెరువులో విద్యార్థులు ఆటలు ఆడుతున్న దృశ్యం

ముంపు తగ్గుముఖం



బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



ములకల్లంకలో ఇంటి వద్ద ఉన్న వారికి వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలో బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య గోదావరి వరద ముంపు తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం ఆయా గ్రామాల ప్రజలకు అధికారులు సహాయ సహకారాలు అందించారు. బోటులపై రాకపోకలు కొనసాగుతున్నాయి. ములకల్లంకలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటి వద్ద ఉన్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రేవు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎంపీడీఓ వెంకటరమణారావు మృతికి సంతాపం

మధురపూడి: పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం ఎంపీడీఓ వెంకటరమణారావు అకాల మృతికి కోరుకొండ ఎంపీడీఓ వి.హేమసుందరరావు ఆధ్వర్యంలో కార్యాలయం అధికారులు, సిబ్బంది బుధవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా హేమసుందరరావు మాట్లాడుతూ వెంకటరమణరావు విధి నిర్వాహణపై శ్రద్ధతో ఉన్నారన్నారు. తొలుత వెంకట రమణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.